క్లుప్తంగా

మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి వినతి



నాగర్‌కర్నూల్: నియోజకవర్గానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సచివాలయంలో పంచాయతీ రాజ్ శాఖా మంత్రి దనసరి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పలుచోట్ల బీటీ రోడ్ల నిర్మించాలని నిధులు మంజూరు చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

నాగరకర్నూల్: మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



చారకొండ: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారుల వెంట, ప్రభుత్వ స్థలాల్లో ఉపాధి కూలీలతో మొక్కలు నాటించారు. మండల కేంద్రంలో కమ్యూనిటీ స్థలాల్లో ఎంపీడీఓ మొక్కలు నాటారు. నాటిన మొక్కలు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కాలనీలో పర్యటించిన కమిషనర్



కల్వకుర్తి: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో నెలకొన్న సమస్యలను వార్డు కౌన్సిలర్ షేక్ ఏజాస్‌తో కలిసి కమిషనర్ అశ్రిత్ కుమార్ పర్యటించారు. కాలనీలో కుక్కలు, కోతుల బెడద అధికంగా ఉందని కాలనీవాసులు వారి దృష్టికి తీసుకొచ్చారు. మటన్ మార్కెట్, శిథిలావస్థకు చేరిన ఇళ్లను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మసూర్, చారుక్, ఖలీల్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని మాజీ సింగిల్‌విండో చైర్మన్ జంబుల బుచ్చారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు పాలనతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయన్నారు. మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామస్తులు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేయాలని కోరారు.

లయన్స్ క్లబ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకటేష్

అచ్చంపేట రూరల్: అచ్చంపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మోత్తాల వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని హాజీపూర్ చౌరస్తాలో మంగళవారం క్లబ్ 38వ ఇన్వోవేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పోల శ్రీనివాసులు, కోశాధికారిగా శివశంకర్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, కౌన్సిల్ సెక్రెటరీ రాధాకృష్ణ, సభ్యులు రమేష్, నరేష్, వినోద్, చంద్రకుమార్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు



కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించిందని బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు, బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు ధారా శేఖర్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌బీడీ ప్రభుత్వ పాఠశాలను వారు సందర్శించారు. అనంతరం వసతి, సౌకర్యాల గూర్చి ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

సబ్సిడీ దూరం.. ధరలు భారం

- అటకెక్కిన యాంత్రీకరణ పథకం
- ఇబ్బందులు పడుతున్న రైతులు



తాడూరులో ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు

తాడూరు: రైతులకు యాంత్రీకరణ వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రైతులకు వ్యవసాయ పరికరాలపై అవగాహన లేక నష్టపోతున్నారు. ఆరేండ్లుగా యాంత్రీకరణ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వ్యవసాయంలో యంత్రాల వినియోగాన్ని పెంచి అన్నదాతలకు కూలీల ఖర్చు భారాన్ని, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన పథకం నిర్వీర్యం అయ్యింది. పథకాన్ని మళ్లీ పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం మాత్రం సబ్సిడీ యంత్రాల పరికరాలు అందించడం లేదు. దీంతో రైతులు ప్రైవేట్ లో కొనలేక ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడి భారం ఎక్కువ

జిల్లాలో ఆరేండ్లుగా రైతులకు సబ్సిడీ యంత్రాలు, పరికరాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి సహాయం కరువైంది. దీంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న అన్నదాతల పరికరాల కొనుగోలు ఆర్థిక భారం అయ్యింది. కూలీల ధరలు పెరగడంతో యంత్రాల ద్వార కలుపుతీత, భూమి సాగు, మందు పిచికారీ ఎంతో లాభదాయకంగా మారిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో యంత్రాల సబ్సిడీకి మంగళం పలకడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది పంటలకు రైతుల సబ్సిడీపై అందించే యంత్రపరికరాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో 2017 వరకు ఏటా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందేవి. ఆ తర్వాత 8 సంవత్సరాలు అవుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల ప్రభుత్వం అని చెప్పుకున్న అప్పట్లో పనిముట్లు కనుమరుగైనాయి, రైతులకు సబ్సిడీపై ఎలాంటి పరికరాలు అందడం లేదు.

రాయితీ పరికరాలపై ఆశలు

కూలీలను ఖర్చులను తగ్గించడంతోపాటు సమయాన్ని ఆదా చేసుకునేందుకు రైతులు అధికంగా యంత్రాలపై ఆధారపడుతుంటారు. ప్రతి ఏటా మార్చి నుంచి ఆర్థిక సంవత్సరం కాగా గడువులోగా కేటాయించిన నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. రిజర్వేషన్ల వారిగా రైతుల ట్రాక్టర్లను మండలానికి కేటాయించేవారు. తదుపరి మీసేవా ద్వార దరఖాస్తులను స్వీకరించడం, జిల్లా కమిటీల ద్వార రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఆమోదం తెలిపి కలెక్టర్ల అనుమతితో రైతులకు ట్రాక్టర్లను అందజేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా రైతులు పంటలు పండించేందుకు పరికరాలు కూడ సబ్సిడీ ద్వార పంపిణీ చేశారు. 2017 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన ప్రభుత్వ నిధులను నాలుగు విడతలుగా మూడు నెలలకు ఒకసారి నిధులు విడుదల కావాల్సి ఉండగా ఇంతవరకు అతిగతి లేదు.

బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు

వ్యవసాయ రంగానికి కావాల్సిన పరికరాల ధరలు ప్రైవేట్ దుకాణాలలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గతంలో రోటొవేటర్ రూ.80 వేలు ఉండగా ప్రస్తుతం రూ.లక్ష దాటింది. కల్టివేటర్ రూ.24 వేలు ఉండగా ప్రస్తుతం రూ.40 నుంచి 50 వేలకు చేరింది. కలుపు తీసే యంత్రం రూ.40 వేలకు చేరింది. తైవాన్‌స్ప్రేర్ మిషన్ రూ.18 వేలు ఉండగా ప్రస్తుతం రూ.30 వేలకు చేరిందని రైతులు వాపోతున్నారు.

పరికరాలు అందడం లేదు



గతంలో వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందజేసేవారు. ఆరేళ్ల నుంచి రాయితీ పరికరాలను ఇవ్వడం లేదు. ప్రస్తుతం అధునాతన వ్యవసాయం వైపు వెళ్లకపోతే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయంలో యంత్రపరికరాలకు ప్రాధాన్యత బాగా పెరిగింది.

– గోపాల్, రైతు ఇంద్రకల్

సబ్సిడీ రావడం లేదు



ప్రభుత్వం ద్వార రైతులకు వ్యవసాయ పరికరాల కోసం 2017 వరకు సబ్సిడీ వచ్చింది. ఆ తర్వాత సబ్సిడీ రావడం లేదు. రైతుల నుంచి వినతులు వచ్చాయి. ప్రభుత్వం ఎప్పుడు సబ్సిడీ ఇచ్చినా పరికరాలు అందిస్తాం.

– సాయిరమేష్‌కుమార్, ఏఓ

మట్టి మిద్దెల్లో నివాసం ఉండొద్దు



తిప్పాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లెనిన్

ఉప్పునుంతల: ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలకు మట్టి మిద్దెలు, పూరి గుడిసెల్లో నివాసం ఉండొద్దని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎస్ఐ లెనిన్ సూచించారు. మంగళవారం మండంలంలోని వెల్టూరు, తిప్పాపూర్ గ్రామాలను ఆయన సందర్శించారు. మట్టి మిద్దెలు, పూరి గుడిసెల్లో ఉన్న వారిని కలిసి అవగాహన కల్పించారు. పొరుగున ఉన్న వారి ఇళ్లలో, గ్రామంలో ఉన్న కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ భవనాలు తదితర సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు. వర్షాలకు మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు.

తాడూరు: మండలంలోని ఎంగంపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎస్ఐ మహేష్ సందర్శించారు. పాఠశాల పైకప్పు పెచ్చులూడటంతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఉన్న పిల్లలను, విద్యార్థులను పక్కనే ఉన్న భవనంలోకి మార్చారు.

వెల్దండ: ముసురు వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కురుమూర్తి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయా కాలనీలో మట్టి మిద్దెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. మట్టి మిద్దెలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి సలహాలు, సూచనలు చేశారు. పోలీస్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: ప్రజలు వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని గౌరారంలో ఆయన పర్యటించారు. గ్రామంలో వివిధ కాలనీలో పర్యటించి పాత ఇళ్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట పోలీసు సిబ్బందితోపాటు గ్రామస్తులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయ్యి చూపిందని, తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజనలో తెలంగాణకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయహోదా తీసుకురావడంతో రాష్ట్ర బీజేపీ ఎంపీలు విఫలం అయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, నాయకులు అశోక్, రామయ్య, కాశన్న, లింగం, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

తిరునాంపల్లిలో మెడికల్ క్యాంప్

పెద్దకొత్తపల్లి: మండలంలోని తిరునాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తుల రక్త నమూనాలు సేకరించి అక్కడే పరీక్షలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా జ్వరాలు ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీహెచ్ఓ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు రేణుక, వినోద, కళావతి, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో ఎక్సైజ్ ఎస్ఐ హనుమంతు ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఇద్దరి ఇళ్లలో ఆరు లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో బైండవర్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మంజుల, వెంకటేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన తేజస్విని 10వ తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించింది. ఈమేరకు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి విద్యార్థికి మంగళవారం రూ.10 వేలు ఆర్థికసాయన్ని అందజేశారు. అదేవిధంగా మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన చంద్రయ్య మంగళవారం మృతి చెందాడు. గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాముడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు అందజేశారు. ఆయన వెంట శ్రీకాంత్‌రెడ్డి, రవిగౌడ్, పాండురంగారెడ్డి, మహేందర్, బాల్‌జంగయ్య, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023–24 ఇంటర్ ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి స్టేట్ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వవిద్యార్థులు నిర్మల, లక్ష్మారెడ్డిలు కలిసి ఆరుగురు విద్యార్థులకు మొత్తం రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, కళాశాల లెక్చలర్లు, విద్యార్థులు ఉన్నారు.

పాముకాటుతో బాలిక మృతి

చారకొండ: మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన ఎదుల సువర్ణ యాదయ్యల కూతురు రేణుక(4) సోమవారం రాత్రి పాము కాటుకు గురై మృతి చెందింది. ఇంటికి సమీపంలో ఉన్న పుట్టలో పాములే కారణమని భావించి జేసీబీతో పుట్టను తవ్వారు. పుట్టలోంచి పాము, పాముపిల్ల బయటపడటంతో గ్రామస్తులు వాటిని చంపివేశారు. అనంతరం కుటుంబ సభ్యులు మృతి చెందిన బాలిక అంత్యక్రియలను నిర్వహించారు. చిన్నారి మృతితో గ్రామస్తులు కన్నీటిపర్యంతం అయ్యారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

రోడ్డుపై కూరగాయలు అమ్మొద్దు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల రోడ్డుపై కూరగాయలు అమ్మొద్దని ఎస్ఐ సతీష్ కోరారు. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంతలో కూరగాయల అమ్మకందారులు నడిరోడ్డుపై కూరగాయలు విక్రయిండంతో వాహనాదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వాహనాల రాకపోకలకు దారి వదలాలని సూచించారు.

ఎస్ఐకి సన్మానం

వెల్దండ: ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కురుమూర్తిని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు రాజు, శ్రీనివాసులు శాలువాలతో సన్మానించారు.

అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మించాలి



కొల్లాపూర్‌లో మురుగు కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొల్లాపూర్: పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన మురుగు కాలువలను ఆయన పరిశీలించారు. కేఎల్ఐ గెస్టహౌజ్, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న ప్రధాన మురుగు కాలువ ఆధునీకరణకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడంతో జాప్యం చేయడం తగదన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దశరథం, తారాసింగ్, సలీం, జల్లాపురం సురేందర్, బాలునాయక్, హథీరామ్ తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు గోవులాపూర్ గ్రామాన్ని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ సందర్శించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ సెక్రెటరీ స్వర్ణలతకు వినతిపత్రం ఇచ్చారు.

తెలకపల్లి: మురుగుకాల్వలకు మరమ్మతు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజా సమస్యల అధ్యయనంలో భాగంగా ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించారు. దళితుల ఇళ్ల మధ్యలో ఉన్న మురుగు కాల్వకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. దళితులు రోగాలబారిన పడుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గోపస్ లక్ష్మన్, కొంగరి కాశన్న, బాస్కర్, మణెమ్మ, శివ, కురుమయ్య పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం



తెలకపల్లి: పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గౌరెడ్డిపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామ వీధులలో తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో పాత ఇళ్లను తొలగింపు పనులను, ట్యాంక్‌బండ్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో పారిశుద్ధ్య పనులను కార్మికులతో చేయించారు. నేలకు వాలిన విద్యుత్ తీగలను సరిచేయించారు. ఆయన వెంట ఏపీఓ మల్లేష్, మాజీ సర్పంచ్ బాలగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రామస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఎస్ఐ రామన్‌గౌడ్ మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



బల్మూర్: మండల కేంద్రంలోని చెంచు కాలనీలో కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కోఆర్డినేటర్ పెద్దులయ్య మాట్లాడుతూ చెంచు గిరిజనులకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా సంస్థ ప్రత్యేకంగా చెంచు ప్రగతి సేవా కేంద్రం ఏర్పాటు చేసి ఆహార ధాన్యాల పంటల సాగు కోసం ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కూరగాయల, పండ్ల మొక్కలు ప్రతి చెంచు కుటుంబానికి అందిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చందు నాయక్, సీపీఎఫ్ పవన్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ అన్నారు. మంగళవారం కళాశాల ఆవరణలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఒత్తిడి జయించేందుకు యోగా, ధ్యానం, క్రీడలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ కృష్ణమోహన్, ప్రోగాం ఆఫీసర్ జ్యోతి, సిబ్బంది విజయ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు లక్ష్మీ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో ఉజ్వల భవిష్యత్



నాగర్‌కర్నూల్‌రూరల్: సృజనాత్మకతతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి మాధవి అన్నారు. మంగళవారం కళాశాల ఆవరణలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కొత్త ఆలోచనలతో ఆవిష్కరణలు చేయాలని కోరారు. అంతకుముందు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాగవేణి నర్సింహులు, రవిప్రకాష్, హరిత, తస్కిన్, రాజయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని ఇప్పకుంట గ్రామానికి చెందిన పులిజాల సుధాకర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో టేకు చెట్లు కొట్టేసిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రేణయ్య తెలిపారు. రైతు మామిడితోట చుట్టు టేకు చెట్లు పెంచాడు. పొలంలో ఎవరు లేని సమయంలో గ్రామానికి చెందిన గంట్ల తిరుపతయ్య, మల్లయ్యలు జేసీబీతో 12 టేకు చెట్లను తొలగించారని పేర్కొన్నారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

కల్వకుర్తి టౌన్: పట్టణ శివారులో మంగళవారం వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న మొగులాలి, మధు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20,220 నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

పన్ను స్లాబ్ ఇంకా పెంచాల్సింది..



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఉద్యోగుల పన్ను పరిమితి 3 లక్షల వరకు మినహాయింపు ఇచ్చింది. అయితే ఉద్యోగులు ఆశించినంత మేరకు కేంద్రం స్లాబ్‌ను పెంచలేదు. పదేళ్ల తర్వాత స్లాబ్ పరిమితి పెంచగా, దీన్ని మరింత పెంచితే ఉపయోగం ఉండేది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేకంగా కేటాయింపులు లేకపోవడం బాధాకరం. రాష్ట్రంలో కొత్తగా రైల్వేలైన్లు, జాతీయ రహదారులకు నిధులు వస్తాయని భావించగా నిరాశే ఎదురైంది.

– వహీద్ ఖాన్, టీయూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడానికి తగిన నిధుల కేటాయింపు లేదు. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణను పూర్తిగా విస్మరించడం దారుణం.

– బాల్‌నర్సింహ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి

పేదరిక నిర్మూలనే లక్ష్యం



రైతు, యువజన సంక్షేమంతో పాటు గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ఉంది. వ్యవసాయం అనుబంధ రంగాలను అభివృద్ధి పరిచేందుకు గతంలో కంటే అత్యధికంగా నిధులను కేటాయించడం బీజేపీ రైతు పక్షపాతి అని మరోసారి రుజువైంది. విద్య, నైపుణ్యాభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు కేటాయించి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడం శుభసూయికం.

– జక్క రఘునందన్ రెడ్డి, బీజేపీ నాయకుడు, నాగర్‌కర్నూల్

వేతన జీవికి దక్కని ఊరట



ఈ బడ్జెట్ సగటు వేతన జీవికి ఆశించిన స్థాయిలో లేకపోవడం నిరాశపరిచింది. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచడం కొత్త రెస్యూమ్‌లో స్లాబ్‌లను మార్చడం వల్ల కొంత తగ్గవచ్చు. కానీ పాత రెస్యూమ్‌లో ఉన్న ఉద్యోగులకు ఎలాంటి లాభం లేదు. ఉద్యోగులందరూ రూ.10 లక్షల వరకు పన్ను మినహాయింపు కోరుతూ చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నా అలాంటి నిరాశ మిగిలింది.

–సత్యనారాయణరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

పన్నుల స్లాబ్ పెంచి ఉంటే బాగుండేది



కేంద్ర బడ్జెట్‌లో పన్నుల స్లాబ్‌లో కొన్ని సడలింపులు చేశారు. అయితే జీరో పన్ను అనేది రూ.3 లక్షల వరకే పరిమితం చేశారు. దీన్ని రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు పెంచి ఉంటే వేతన జీవులకు ఊరటగా ఉండేది. బడ్జెట్‌లో సరళీకరణ విధానాలు కనబడుతున్నాయి. ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులకు రూ.10 లక్షల వరకు రుణాలు, ముద్ర లోన్లను రూ.20 లక్షలకు పెంచడం, పీఎం ప్యాకేజీ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శ్రీకారం చుట్టడం స్వాగతించదగ్గ పరిణామాలు.

– కృష్ణప్రసాద్, టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర సహ కార్యదర్శి

సామాన్యులకు ఒరిగిందేమీ లేదు



కేంద్ర బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. పెట్రోల్ కెమికల్ వస్తువులపై కస్టండ్యూటీ పెట్టడం వల్ల ఫర్టిలైజర్, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరుగుతాయి.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి



కల్వకుర్తిరూరల్: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజు మహాసభ జిల్లా నాయకుడు బాల్‌చందర్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ముదిరాజు మహాసభ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ముదిరాజుల సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. ఇప్పటికైనా ముదిరాజ్‌ల అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజు మహాసభ యువజన సంఘం అధ్యక్షుడు జమ్ముల శ్రీకాంత్, శ్రీధర్, రామస్వామి, వెంకటయ్య, జంగయ్య, శ్రీకాంత్ తదితరులు పలువురు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ల విడుదల

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో మాసూంబాబా 39వ ఉర్సు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను దర్గా వద్ద మంగళవారం ముస్లిం మత పెద్దలు విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు వలిమెహిమోద్దీన్ మాట్లాడుతూ 28న రాత్రి 10 గంటలకు గంధోత్సవం, 29న దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.